[మూడవ భాగము]

పిడుగుల్లా వినబడ్డాయి కాప్టెన్ మాటలు.

శాన్యోరా, నేనూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం.

“రెండు రోజులకు సరిపడే పాక్డ్ ఫుడ్స్ మాత్రం మీకు యివ్వబడుతాయ్. ఏదో క్షణంలో ఏ సముద్ర జంతువులో మిమ్మల్ని చప్పరించేస్తాయి. లేదా ఆహారం లేక చిక్కి శల్యమై యే ఒడ్డయినా చేరితే అక్కడి పోలీసులు మిమ్మల్ని బంధించి యిండియాకి పార్సెల్ చేస్తారు.”

"మరో విషయం! మీవద్ద రివాల్వర్ లాంటి ఆయుధాలు ఏవీ వుండవ్.

కంపాస్ (దిక్సూచి) కూడా యివ్వం. నాలుగు తెడ్లు సీన్లు చూసుకోడాన్కి బైనాక్యులర్ మాత్రం యిస్తాం," అన్నాడు నవ్వుతూ.

"దిసీజ్ హారిబుల్ కాప్టెన్!" అరిచాను నిస్సహాయంగా.

"అదృష్టం వుంటే నలభై ఎనిమిది గంటలపైగా జీవించి హాయిగా సెలిబ్రేట్ చేసుకోండి. హాట్ డ్రింక్స్ మీకు కావల్సినంత యిస్తాను అయితే ఓ షరతు. చచ్చిం తర్వాత మాత్రం జంట దెయ్యాలుగా మారి నన్ను ఏడిపించకండి" అన్నాడు గలగల నవ్వుతూ కాప్టెన్.

నా ముఖం పాలిపోయింది. ఏం చెయ్యాలి?

కనీసం మెషీన్ బోటయినా కాదు. చేతుల్తో లైఫ్ బోటుని ఎన్ని వందలమైళ్ళు నడిపి పోర్ట్ సూడాన్ చేరతాం? అయోమయంగా కాన్యోరా వైపు చూసాను. ఆమె ముఖం చెమట పట్టి కోపంగా కనిపిస్తోంది. ఎవడి పీకో అందుకొని కొరికెయ్యాలన్నంత క్రోధంగా ఉందామె.

"వెల్ మిస్టర్ భయంకర్! నువ్వు స్పృహతప్పి అర గంట మాత్రం అయింది. యిప్పుడు సాయంత్రం ఆరు గంటలవుతోంది. చీకటి పడకుండానే మిమ్మల్ని పంపించెయ్యాలనుకుంటున్నాం. ఈ రాత్రి మేము హాయిగా నిద్రపోవాలి. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. లైఫ్ బోటు మీకోసం ఎదురు చూస్తోంది. గెటప్!" అన్నాడు గంభీరంగా కాప్టెన్, పిస్తోలు ఆడిస్తూ.

* * *

తెడ్లు వేగంగా కదుల్తున్నాయి......

లైఫ్ బోటుని ముందుకు పోనిస్తున్నాను.

ఎయిమ్ లెస్ సైలింగ్!

శానో్యరా ఏదో ఆలోచిస్తూ కూర్చుండిపోయింది.

చీకట్లు ముసురుకుంటున్నాయ్.

మమ్మల్ని వదిలివేసిన సీఫ్లవర్ ఓడ కనుచూపుమేరలో కనబడుతోంది.

ఉన్నట్లుండి ఉలిక్కిపడ్డాను.

కాస్సేపు తెడ్లు వెయ్యడం ఆపి నీటి ఉపరితలంపై ముఖం పెట్టి చెవులు రిక్కించాను!

సముద్రంలో ఏదో గందరగోళం జరుగుతోంది.

మెదడులో ఏదో అనుమానం తట్టింది.

నిజమేనా అది? మైగాడ్...

"శా...నో్య...రా!" కేక పెట్టాను.

నా కేకకు అదిరిపడి ఈ లోకంలోకి వచ్చిందామె.

"ఏమిటి?" అంది కంగారుగా.

"సముద్ర భూకంపం!" అరిచాను. "క్విక్! లైఫ్ బోటుకు నీ కాళ్ళు, నాకాళ్ళు, సామగ్రి అన్నీ కలిపి కదలకుండా తాడుతో కట్టెయ్యి, ప్రశ్నలు వద్దు."

శానో్యరా చటుక్కున ఓ తాడు అందుకుంది.

ఈదురు గాలీ, వర్షం ఏమీ లేవు.

కొండలు గుద్దుకొంటున్నట్లుగా, నీరు లోలోపలే గుద్దుకుంటోంది.

కెరటాల కదుపుకు లైఫ్ బోటు నాలుగు అడుగులు పైకి లేచింది.

బలంగా ఎత్తి కుదేసినట్లయింది.

ఓ చేత్తో లైఫ్ బోటు అంచును బలంగా పట్టుకుని బైనాక్యులర్స్ తీసి స్లీఫవర్ షిప్ వైపు చూశాను.

అంతే! అదిరిపోయాను.

నా తల మీద పది యిటుకలు పడ్డట్లయింది.

రెండు నీటి ఉప్పెనలు వచ్చి అంత పెద్ద నౌకని నీటిలోకి తీసుకుపోయాయి. ఒక్క కొయ్యముక్క కూడా నీటి పైకి రాలేదు.

ఏమయింది...?

నీటిలో అర్థంకాని భయంకర శబ్దం వినబడింది.

అది ఏమిటి...??

శాన్యోరా తాళ్లు కట్టడం పూర్తయింది. యిప్పుడు నా కాళ్ళు కదలడంలేదు.

"శాన్యోరా! మనల్ని వదిలిన షిప్ సముద్రగర్భంలో కల్సిపోయింది."

"మేజర్! నాకేం అర్థం కావటంలేదు." అంది శాన్యోరా అయోమయంగా, బోటు అంచును గట్టిగా పట్టుకుంది.

లైఫ్ బోటు ఎగిరి ఎగిరి పడుతోంది.

ఇప్పుడు దాన్ని నడపడం అసాధ్యం.

తెడ్లు ఎప్పుడో జాగ్రత్త చేశాను.

అ స్తవ్యస్తంగా, ఉధృతమైన కెరటాలు లైఫ్ బోటుని అతివేగంతో ఎక్కడికో తీసుకుపోతున్నాయి.

"శాన్యోరా! బోటు అంచున వున్న తాళ్ళు గట్టిగా పట్టుకో, సముద్రభూకంపం ఏర్పడింది. సముద్రగర్భంలో నేల రెండుగా చీలిపోయివుండాలి. అందులోకి ఆబరువైన స్లీఫవర్ షిప్ యిరుక్కుపోయివుండాలి. అందుకే ఒక

కొయ్యముక్క కూడా నీటిపైకి కొట్టుకురాలేదు.''

"ఫాం...టా...స్టి...క్..." గొణిగింది శాన్యోరా.

"నథింగ్ ఫాంటాస్టిక్ శాన్యోరా! సముద్రభూకంపం మహావినాశకరమైంది. ముందుగా ఏ నావికుడికీ తెలియదు. మన లైఫ్‌బోటు చిన్నది. తేలికయినది. ఏట్లో గడ్డిపోచలా కొట్టుకుపోతుంది. అందుకే నువ్వు గట్టిగా పట్టుకోవాలి."

నా మాటలు పూర్తి కాలేదు. కెరటాల వేగం పెరిగింది.

విమాన వేగంతో కొట్టుకుపోతోంది మా లైఫ్‌బోటు!

నా కళ్ళు తిరుగుతున్నాయి.

"శాన్యోరా! వదలకు పట్టు. బీ కేర్ ఫుల్!" అరిచాను మరోసారి.

కెరటాలు ముఖంమీద ఈడ్చి కొడుతున్నాయి.

ఒకో క్షణంలో ఒకవంక మునిగిపోతోంది లైఫ్‌బోటు.

అయితే బోటు లోతులేకుండా ఫ్లాట్‌గా ఉండటం వల్ల మళ్ళీ తేలుతోంది.

కళ్ళు మండుతున్నాయి ఉప్పునీళ్లుపడి.

వాటర్‌ప్రూఫ్ పాకింగ్‌లో ఉన్న సామగ్రిని అప్పుడప్పుడు కాలితో తడుముతూ ధైర్యం తెచ్చుకుంటున్నాను.

ఒక కెరటం వెళ్ళి మరో కెరటం వచ్చే ఖాళీ సమయంలో చటుక్కున ఎదురుగా ఉన్న శాన్యోరాని పట్టుకున్నాను.

"థాంక్యూ మేజర్" అంది భయంగా నన్ను వాటేసుకుంటూ.

మా కాళ్ళని తాళ్ళు పెనవేశాయి.

లైఫ్‌బోటు అతివేగంగా జారుతోంది నీటిపై.

చుట్టూ అనంతసాగరం...

మిమ్మల్ని ఎక్కడికో తీసుకుపోతున్నాయి ఊహించని వేగంతో బలమైన కెరటాలు.

జానీ కళ్ళలో మెదిలాడు...

నా కళ్ళలో వెచ్చటి కన్నీళ్ళు ఉబికాయ్.

షిప్‌లోని జానీ సాగరగర్భంలో... సజీవ సమాధి అయిపోయి ఉంటాడు,

ఒక్క జానీయే కాదు... అంతా... నాకంటూ తోడు శాన్యోరా మాత్రమే.

ప్రేమగా ఆమెను అతుక్కుపోయాను.

*　　　*　　　*

సూర్యకాంతి ముఖంపై వేడిగా తగిలి నిద్రలేచాను.

ఏమీ ఎరుగని సంగనాచిలా ఇప్పుడు సముద్రం ప్రశాంతంగా ఉంది.

శాన్యోరాను తట్టి లేపాను.

ఆమె నీరసంగా కళ్ళు తెరిచింది.

గతం కలా? నిజమా? అనిపిస్తోంది.

మా లైఫ్‌బోటు సముద్రంమధ్య నీళ్ళపై తేలియాడుతోంది.

జరిగిన విషయం మెల్లగా జ్ఞాపకం వస్తోంది.

సముద్రపు పోటు కొంతసేపటికి తగ్గింది.

కెరటాలు ఒళ్ళు హూనం చెయ్యడంచేత చీకటిలో బోటుమీద అలాగే అలసి నిద్రపోయాం.

ఇద్దరం తడిసిపోయి ఉన్నాం.

ఇంకా ఆరలేదు దుస్తులు.

"శాన్యోరా! అర్ యూ ఓ. కే?" అడిగేను ఆమె

కాలిపన్న కట్లు విప్పుతూ.

శాన్యోరా బాబ్ డ్ హెయిర్ వెనక్కి తోసుకుంటూ సర్దుకు కూర్చుంది.

"అయామ్ ఓ. కే. డియర్! కొంచెం తలనొప్పిగా ఉందంతే." శాన్యోరా కంఠంలో మార్పు కనబడింది, జలుబు చేసినట్లు.

ఆమె నుదుటిమీద చెయ్యివేశాను. వెచ్చగా తగిలింది చెయ్యికి.

"మైగాడ్! జ్వరం ఏ నూటనాలుగో ఉంటుంది. మన దగ్గర ఏ టాబ్లెట్లూ లేవు" అన్నాను ఆందోళనగా.

"ప్లీజ్ టేకిట్ ఈజీ డియర్" అని ఊరుకుని సముద్రం వేపు చూడసాగింది.

రెండు క్షణాలు మౌనంగా ఉండి అడిగేను.

"శాన్యోరా! వేడివేడి కాఫీ పెట్టనా?"

ఉలిక్కిపడి నావేపు చూసింది "నా ఒంటిమీద మరగబెడతావా నీళ్లు?" అంది చేత్తో నవ్వునాపుకుంటూ.

"నువ్వలాగే చూస్తూ ఉండు" అన్నాను సీరియస్ గా.

గబగబా ఫుడ్ పాకెట్స్ వేపు నా చేతులు కదిలాయి.

నెస్ కాఫీ పౌడర్ డబ్బా బయటకి తీశాను.

మిల్క్ టిన్ తీసి, బూటుకాల్లోని కత్తితో ఓపెన్ చేసాను.

బిస్కట్ల డబ్బా ఖాళీచేసి కొన్ని శాన్యోరా చేతిలో పెట్టి, మిగతావి పాలిథిన్ కాయితంలో చుట్టేశాను.

ఖాళీ బిస్కట్ల డబ్బాలో కాఫీపౌడర్ పోసి, కండెన్స్డ్ పాలు అందులోకి వంపాను.

విస్కీ బాటిల్ బయిటకితీసి కార్క్ లాగాను.

శాన్ద్యోరా బిస్కట్ కొరుకుతూ నావేపు వింతగా చూస్తోంది.

నవ్వుతూ ఆమె పొత్తికడుపుమీద చేయి వేశాను.

కంగారుగా అదోలా అరుస్తూ పైకిలేచింది శాన్ద్యోరా.

నా చెయ్యి బయిటికి లాగాను. అంతే!

ఆమె ధరించిన ఎర్రటి ఊలు స్వెటర్ క్రిందిభాగం నుండి నాలుగయిదు మూరల ఊలుదారం బైటికి వచ్చింది. మళ్ళీ ఆమె నడుంవద్ద ముఖం పెట్టి రెండో కొస దారం నోటితో తెంపాను.

శాన్ద్యోరా నా తలమీద చిన్నగా మొట్టి మౌనంగా కూర్చుంది.

ఊలుదారాన్ని నాలుగయిదు మడతలుపెట్టి దళసరిగా అరచేతిలో పేనుతూ ఒత్తిగా చేశాను.

విస్కీ బాటిల్లో తడిపి ఒత్తి బయిటికి ఉండేలా అమర్చాను.

లైఫ్ బోటులో శాల్ఫ్ ఉంచుకునేచోట, వారగా ఆ సీసాను పెట్టాను.

గాలి తగిలే ప్రమాదం లేదు.

అగ్గిపెట్టెతో ఒత్తిని వెలిగించాను. ఓహ్!

లక్షవత్తుల వ్రతంలో దీపంలాగ అఖండంగా వెలుగుతోందది.

బోటు అంచులమీద తెడ్లు ఒకటికొకటి క్రాస్ అయ్యేలా × మార్కులా అమర్చాను.

రెండూ కలిసేచోట కాఫీ డబ్బా పెట్టాను.

విస్కీబుడ్డి కాల్ గాస్ స్టవ్ లా పనిచేస్తోంది.

డబ్బా పలుచని రేకుతో చెయ్యడంవల్ల త్వరత్వరగా వేడెక్కుతోంది.

రెండు నిముషాల్లో కాఫీ తయారయింది.

"మార్వలస్ డియర్!" ఎగిరి గంతేసినంత పని చేసింది కాన్స్యోరా.

షుగర్ వెయ్యనక్కర లేదు.

పాలలోనే ఉంటుంది.

కప్పులు లేవు.

కొంచెం చల్లబడ్డాక డబ్బాని కాన్స్యోరా కిచ్చాను.

"నీకూ?" అంది నోరు సున్నలా పెట్టి.

"ఫిఫ్టీ-ఫిఫ్టీ! ముందు నువ్వు తాగు. మిగతాది నీ అధరామృతం కలిసి మరింత తియ్యగా ఉంటుంది నాకు."

"యూ్యానాటీ" కొరకొరా చూసింది కాన్స్యోరా.

ఆమె ఒళ్ళోవి రెండు బిస్కట్లు తీసి నవిలేశాను.

"స్టాప్" ఆర్పేసి విస్కీ బాటిల్ భద్రం చేసాను.

"మేజర్ డియర్! అద్భుతంగా ఉంది కాఫీ" కామెంట్ చేసింది సిప్ చేస్తూ.

"అలాగని అంతా తాగెయ్యక."

"అవసరాల్లో నీ బుర్ర హీటర్‌లా పని చేస్తుందని నాకు తెలియదు. లేకపోతే నీ బుర్రమీదే కాఫీ కాచేదాన్ని" అంది కాఫీ టిన్ తిరిగి యిచ్చేస్తూ.

అంచు పట్టుకొని డబ్బాలోకి చూసాను. "ఫిఫ్టీ పిఫ్టీ అన్నాను. తర్టీ పర్సంటే తాగావు?" అడిగాను.

"పాపం కష్టపడి తయారుచేసావ్. డ్రింకిట్ డియర్" అంది సామగ్రిలో చేతులు పెట్టి సిగరెట్ పాక్ అందుకుంటూ.

హాట్ కాఫీ తాగి సిగరెట్ ముట్టించిన తర్వాత జవసత్వాలు తిరిగి చకచకా పని చేస్తున్నట్లనిపించింది.

శాన్యోరా ఉత్సాహం ఆమె మాటల్లో కనబడుతోంది.

"శాన్యోరా! నువ్వు బట్టలు మార్చుకోవడం మంచిది. లేకపోతే జ్వరం తీవ్రం అయ్యే ప్రమాదం ఉంది" అన్నాను సిగరెట్ పీలుస్తూ.

"వ్హాట్... నీ ఎదురుగా... యిలాగా..."

"డోంట్ బీ సిల్లీ. కనుచూపు మేరలో ఎక్కడా తీరం కనబడటంలేదు. మనకు ఆరోగ్యం పాడవుతే ఇక్కడ మెడిసిన్స్ ఇచ్చేవాళ్ళు ఎవరూ లేరు."

"అయితే మాత్రం... ఛీ... పాడు..."

"ఆల్ రైట్. నేనే నీ బట్టలు విప్పి కొత్తవి కడతాను" అంటూ నవ్వుతూ లేచాను.

"యూ నాటీ రౌడీ!" వెనక్కి తోసింది నన్ను. "ఆల్ రైట్. అటువైపు తిరిగి కూచో."

"ఎటు తిరిగినా నువ్వే కనిపిస్తావ్" అంటూ ఆమె చెప్పినట్లు చేసాను.

"ఇప్పుడు తిరుగు" అంది రెండు నిముషాల తర్వాత.

వెనక్కి తిరిగి చూసాను. ఎర్రపువ్వుల గౌనులో మెరిసిపోతోంది శాన్యోరా.

కూర్చున్నపుడు మోకాళ్ళపైగా పచ్చటి తొడలు మెరుస్తున్నాయి.

"ఎంత అందంగా ఉన్నావో తెల్సా?"

"మీదకిరాక" అంది నవ్వుతూ చేతులు తిన్నగా సాచి.

ఆ చేతులు పట్టుకొని బలంగా నా మీదకు లాక్కున్నాను.

మా పెదిమలు అతుక్కుపోయాయి.

ఉన్నట్టుండి దూరంగా ఏవో కేకలు వినబడ్డాయి, లీలగా.

ఉలిక్కిపడి ఇద్దరం రైలుపెట్టెల్లా విడిపోయాం.

చటుక్కున బైనాక్యులర్స్ తీసాను.

నా కళ్ళు నలువైపులా పరికించాయి.

ఫర్లాంగుదూరంలో ఎత్తయిన ఓ నాటుపడవ కనబడింది.

భారీవృక్షాన్ని దొలిచి తయారుచేసిన పడవ అది.

దానిమీద కొందరు ఆటవికులు, క్లోజప్‌లో కనబడ సాగారు.

ఏవేవో పిచ్చికేకలు వేస్తున్నారు.

వాళ్ళచేతుల్లో పొడవాటి ఈటెలు ఉన్నాయ్.

ఆ విషయం శాన్యోరాకి చెప్పాను.

ఎందుటాకులా వణకసాగిందామె.

* * *

"శన్యోరా! ఆ పడవ వైపు నడుపుదామా?" అడిగాను శాన్యోరాని.

"భయంకర్! ఆటవికులు ఇటువైపు వస్తున్నారంటే దగర్లో ఏదో దీవి ఉండి ఉండాలి. మనం తప్పించుకుని పారిపోగల్గినా బ్రతకడం కష్టం. కారణం మన దగ్గర రేషన్స్ రేపటిదాకా మాత్రం సరిపోతాయి. ఎంత పొదుపుగా మనం వాడినా మేక్సిమమ్ మూడు రోజులు మాత్రం రావచ్చు. ఏమయితే అదవుతుంది. సో... బెటర్ వుయ్ మూవ్ దట్ వే." అంది ధైర్యం తెచ్చుకుంటూ శాన్యోరా.

యిద్దరూ తెడ్లు వేగంగా తిప్పసాగాం.

లైఫ్ బోటు వేగంగా కదులుతోంది.

పది నిముషాల్లో ఆటవికుల పెద్ద పడవకి ఎదురుగా వచ్చాం.

అందరూ మమ్మల్ని చూసి ఏదో భాషలో గొణు క్కుంటున్నారు, గుంపులుగా నిలబడి. వాళ్ళకేసి పరిశీలనగా చూసేను.

అందరివీ నల్లని శరీరాలు.

మెళ్ళోను, మోచేతుల పైగా రంగు రంగుల పూసల దండలున్నాయి.

మొలల దగ్గర తప్ప శరీరానికి ఆచ్ఛాదన ఏమీ లేదు.

తైల సంస్కారం లేని కేశాలు భుజాలదాకా వ్రేలాడు తున్నాయి.

ఏవో పక్షి ఈకలతో, నేర్పుగా అల్లబడిన దుస్తులు మొలల వద్ద ధరించారు.

అందరూ ఓ వృద్ధుడి ప్రక్కగా చేరి ఆటవిక భాషలో మా గురించి ఏదో చెప్తున్నట్లు గ్రహించేను. అతడే నాయ కుడై ఉండాలి.

నా రంగుల చొక్కా విప్పి బోటులో లేచి నిలబడి, నవ్వుతూ స్నేహపూర్వకంగా గాలలో ఆడించాను.

"అవ్... కమ్..." అంటూ అరిచాడు నాయకుడు.

దిగ్భ్రమతో శాన్యోరా, నేను ఒకరినొకరు చూసు కున్నాం.

"శాన్యోరా నాయకుడికి యింగ్లీష్..." ...అంటూ ఆగిపోయాను ఆశ్చర్యంతో.

"బ్రోకెన్ యింగ్లీష్" అంది సంతోషంగా శాన్యోరా.

ఆటవికులు ఓ మోకు తాడు మా బోటువైపు విసిరారు.

ఆ తాడు పట్టుకొని లైఫ్ బోటును ఆ పెద్ద పడవవైపు కదిలించాను.

"శాన్యోరా! ముందు నువ్వెక్కు. తర్వాత నేను తాడుని

లైఫ్ బోటుకి కట్టి పైకొస్తాను. ఓ.కే?''

ఆమె తల ఊపి తాడు పట్టుకుని చక చకా పైకి ఎక్కింది. ఆటవికులు ఆమెకు చెయ్యి అందించి లోపలికి లాక్కున్నారు.

లైఫ్ బోటుని వాళ్లందించిన మోకుతాడుతో బలంగా కట్టాను.

సామగ్రి వీపుకు కట్టుకొని పైకి ఎగబ్రాకాను.

ఎత్తయిన ఆ నాటు పడవను పరీక్షగా గమనించాను.

అది పెద్ద వృక్షాన్ని దొలిచి చేసిందే.

నునుపుగా ఉండటం వల్ల తెల్సింది అలా.

పడవ తట్టు (డెక్) చెక్క ముక్కలతో అస్తవ్యస్తంగా, ఎత్తు పల్లాలుగా ఉంది. తట్టు మీంచి అంతర్భాగంలోకి కొయ్య మెట్లున్నాయ్.

శాన్యోరా అందాన్ని ఆటవికులంతా విచిత్రంగా చూస్తున్నారు.

''మీరెలా వచ్చారు?'' సైగలతో అడిగాడు నాయకుడు.

వృద్ధ నాయకుడికి వచ్చిన ఇంగ్లీషు ముక్కలు చాల తక్కువని అప్పుడు నాకర్థమయింది.

నా చరిత్ర అంతా చెప్పడం కష్టం.

చెప్పినా నాయకునికి అర్థంకాదు.

షిప్ మునిగి ప్రాణరక్షణకోసం ఆ చిన్నబోటులో బయలుదేరినట్లు సైగలతో చెప్పాను.

''మీరంతా ఎక్కడికి బయలుదేరారు?'' నాయకుణ్ణి అడిగాను.

నాయకుడు ఓ చురకత్తి తీసుకొని ఓ చెక్క మీద ఏదో గీయసాగాడు.

"భయంకర్! అది తిమింగలం బొమ్మ" అంది శాన్యోరా ఆశ్చర్యంగా.

నాయకుడు వెనక్కి తగ్గి ఓ ఈటె రివ్వున విసిరాడు.

అది వెళ్ళి తిమింగలం బొమ్మ కడుపులో నాటుకుంది.

నాకు విషయం అర్థమైంది. ఆటవికులు 'తిమింగలాల వేట'కి బయలుదేరారు.

అదే విషయం శాన్యోరాకి చెప్పాను.

"ఫాంటాస్టిక్ అనిపిస్తోంది భయంకర్! తిమింగలాల్ని ఈ ఈటెలతో చంపడం..."

"అలా అనకు శాన్యోరా! తగలవలిసిన చోట తగిలితే ఎంత పెద్ద ప్రాణి అయినా చస్తుంది. వీళ్ళు ఆ విషయంలో బాగా అనుభవజ్ఞులై ఉండాలి."

"ప్రమాదం కదూ! మింగెయ్యదూ?" అన్నట్టు సైగలు చేసాను నాయకుడికి.

నాయకుడు నవ్వాడు.

వెనకాల నిలబడ్డ ఆటవికుల్లోంచి ఒకడ్ని ముందుకు లాగాడు.

అతని వేపు సూటిగా చూశాను.

అతనికి కాలు లేదు!

"తిమింగలం పట్టుకుపోయింది" అన్నాడు నాయకుడు, బొమ్మను చూపించి నోటిని గాలిలో తెరుస్తూ.

"తిమింగలాన్ని చంపడం ఎందుకు?" శాన్యోరా అడిగింది సైగల్లో.

నాయకుడు బొమ్మ వేపు మళ్ళీ కదిలాడు. తల భాగం,

తో కభాగంవైపు చూపించి "తింటానికి" అన్నట్లు సైగలు చేసాడు.

తర్వాత ఆటవికులకేసి తిరిగి ఏదో భాషలో మాట్లాడాడు.

"ఇప్పుడే వేటాడతారా తిమింగలాన్ని?" అడిగాను అర్థమయ్యేట్లు చేతులూపుతూ.

"ఇవ్వాళ దొరకలేదు. రేపు రావాలి. గూడానికి వెళ్ళిపోతున్నాం. మీరు మాతో వస్తారు." అంటూ సైగలు చేసాడు నాయకుడు.

శాన్యోరా ఖరీదైన దుస్తుల్ని వింతగా చూస్తూ నిలబడుతున్న ఆటవికుల్ని పెద్ద కేకతో అదిలించాడు నాయకుడు.

వాళ్లు బిత్తరపోయి వెనక్కి తగ్గారు.

శాన్యోరా కది బాధ అనిపించింది.

గబగబా, సామగ్రిలోంచి టేప్ రికార్డర్ తీసిందామె.

"మీరందరూ పాడండి." అంది వాళ్ళకేసి తిరిగి.

ఆటవికుల కామె మాటలు అర్థం కాలేదు.

నేను నవ్వుతూ "అయ్ లవ్ శాన్యోరా!" అంటూ పాడాను.

వాళ్ళ కర్థం అయి ఉండాలి.

కేరింతలు కొడుతూ 'కెవాలో... కెవాలో..." అంటూ పాట పాడసాగారు.

పాట పూర్తయిం తర్వాత శాన్యోరా నోటిమీద వ్రేలు పెట్టి మౌనంగా ఉండమని వాళ్ళందరికీ చెప్పింది.

ఆమె చేతులు టేప్ రికార్డర్ మీద కదిలాయి.

ఆటవికులు టేప్ రికార్డర్ కేసి భయంగా చూడసాగారు.